

ఉద్యోగులు, పెన్షనర్లకు అండగా ప్రభుత్వం

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ఆథరైజేషన్ కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తోందని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎన్.మోహన్‌రావు అన్నారు. - 10లో..



ఉల్లాసంగా రంగవల్లుల సంబరం

కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
32/22

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు: స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి అని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, యువజన సంక్షేమశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, ఏపీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో ఆర్డినేటర్ డి.జయ, జిల్లా నెహ్రూ యువజన సంక్షేమశాఖ అధికారి కమల్‌సా తదితరులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో యువత నడవాలన్నారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్టెప్ సీఈఓ ఎంపీఎస్ లోకేశ్వరరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద చిన్న వయసులోనే అనేక విజయాలు సాధించారన్నారు. యువత చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ కలిగి ఉండి అన్ని విషయాల్లో అవగాహన పెంచుకుంటే ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు.

మరో కోవిడ్ కేసు నిర్ధారణ

ఒంగోలు టౌన్: ఒంగోలులో మరో కోవిడ్ కేసు నిర్ధారణ అయింది. తెనాలికి చెందిన 51 ఏళ్ల మహిళ ఇటీవల తీర్థయాత్రకు వెళ్లి మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో తిరిగారు. 15 రోజుల యాత్రను ముగించుకొని ఇటీవల ఊరికి వచ్చారు. అప్పటి నుంచి జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో బాధపడున్న ఆమె ఇంకొల్లులో ఉన్న తల్లి వద్దకు వచ్చారు. గురువారం ఒంగోలులోని జీజీహెచ్‌కు రాగా అనుమానం వచ్చిన వైద్యులు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో ఆమెకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఇంకొల్లులోని తల్లి గృహంలోనే హోం ఐసోలేషన్‌లో ఉండి చికిత్స తీసుకుంటున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మితో పాటుగా ఇంకొల్లు మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చామని తెలిపారు.

డీసీసీబీ సభ్యుల పదవీ కాలం పొడిగింపు

ఒంగోలు సిటీ: డీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, కమిటీ సభ్యుల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించినట్లు సహకార కమిషనర్, రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీ గుంటూరు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఏడుగురు సభ్యుల నాన్ అఫీషియల్ సభ్యులు, ఇన్‌చార్జ్ కమిటీల కాలం ఆరు నెలలపాటు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, ప్రకాశం, అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల డీసీసీబీలకు వర్తిస్తుందని తెలిపారు.

మళ్లీ ప్రజా ప్రభుత్వమే..



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, వేదికపై మంత్రి మేరుగు నాగార్జున

- మేరుగు నాగార్జున అవసరాన్ని గుర్తించే ఇన్‌చార్జిగా ప్రకటన
- సంతనూతలపాడులో మరోమారు పార్టీ జెండా రెపరెపలాడిద్దాం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

ఒంగోలు: అందరి సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని, సంతనూతలపాడు నియోజకవర్గానికి విద్యావేత్త, సౌమ్యుడు మేరుగు నాగార్జున అవసరాన్ని గుర్తించే ఇన్‌ఛార్జిగా నియమించారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. స్థానిక విష్ణు ప్రియ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మేరుగు నాగార్జున అందరినీ కలుపుకుపోయేవారన్నారు. దాదాపు నెల రోజుల క్రితం నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ప్రకటించినా అందరి సమన్వయంతో ముందుకు వెళ్లాలనే ఉద్దేశంతో ఇప్పటివరకు నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులకు పరిచయం కాలేదన్నారు. ఈ పరిచయ కార్యక్రమానికి నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులను ఆహ్వానించినా ముందుకు రావడంలేదని, కార్యక్రమాన్ని వాయిదా వేయాలని గురువారం రాత్రి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మెసేజ్ పంపారన్నారు. ఎవరు వచ్చినా రాకున్నా వైఎస్సార్ సీపీ తరుపున గెలిచి ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న సుధాకర్‌బాబు కార్యక్రమానికి రాకుండా మెసేజ్ పంపడం సరికాదన్నారు. ఇది పూర్తిగా పార్టీ పరంగా క్రమశిక్షణారాహిత్యంగా పరిగణిస్తామన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి, పార్టీపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత పార్టీలోని అందరిపై ఉందని, ఇదే విషయాన్ని తాము చెబుతుంటే మీడియా, టీడీపీ నేతలు వక్రీకరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంత్రిగా, నిబద్ధత కలిగిన నాయకునిగా సామాజికంగా అందరికీ అండగా ఉంటే మేరుగు నాగార్జునకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్న తనను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయాల్లోకి ఆహ్వానించి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారన్నారు. 2009లో వైఎస్సార్, 2014లో జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ కేటాయించినా ఓటమి పాలయ్యాయని, అయినా నా మీద నమ్మకంతో 2019లో మళ్లీ అవకాశం ఇవ్వడంతో 10 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందానని పేర్కొన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తనకు వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇచ్చారని, ఆ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సహకారంతో అందరినీ కలుపుపోయి వైఎస్సార్ సీపీ జెండా మరోసారి సంతనూతలపాడులో ఎగురవేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో తనపై ఇప్పటికే అసత్య ప్రచారాలు చేస్తున్నారని, రెండు సార్లు ఓటమి పాలైనా అదే ప్రాంతంలో టికెట్ ఇచ్చారంటే పార్టీ అధినాయకత్వానికి తానేంటో తెలుసని, వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు.

బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో నేడు రాష్ట్రంలో పేదరికం స్థాయి 12 శాతం నుంచి 5శాతానికి పడిపోయిందన్నారు. ప్రతిపక్షాలు, పచ్చమీడియా మనపై మూకుమ్మడిగా దాడి చేసేందుకు వస్తున్నాయని, మనం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకువెళితే చాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అంటేనే కార్యకర్తలకు భరోసా అని, జిల్లాలోని అన్ని సీట్లను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ శాయశక్తులా కృషి చేయాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వరుసగా 5 సార్లు తెలుగుదేశం పార్టీకి గుణపాఠం చెప్పిన నియోజకవర్గం సంతనూతలపాడు అని, వచ్చే ఎన్నికల్లో కూడా మరోమారు గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ సీఎం జగన్‌కు బీసీల పట్ల ఎంతటి ప్రేమ ఉంటుందో తానే ఒక నిదర్శనమన్నారు. ఒకసారి ఓటమి పాలైనా అక్కడే టిక్కెట్ ఇచ్చి గెలిపించిన నేత వైఎస్ జగన్ అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే, దర్శినియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గెలుపు పేదల జీవితాలకు మలుపన్నారు.

సమావేశంలో సామాజిక న్యాయ ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావుమాదిగ, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి సుబ్బారెడ్డి, ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు, జగనన్న ఫౌండేషన్ అధ్యక్షుడు వారా వీర్రాజు, వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్, కార్మిక సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ పెద్దిపోగు కోటేశ్వరరావు, నాగులుప్పలపాడు జెడ్పీటీసీ రత్నభారతి, నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, మద్దిపాడు ఎంపీపీ వాకా కోటిరెడ్డి, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి, చీమకుర్తి రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర రెడ్డి, లిడ్ క్యాప్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పేరాల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గతంలో పార్టీ నుంచి సస్పెండైన నాగులుప్పలపాడు మాజీ మండల కన్వీనర్ పోలినేని కోటేశ్వరరావుకు విజయసాయిరెడ్డి కండువా కప్పి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు.



సమావేశానికి హాజరైన సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు

కొండపిలో

వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి



కొండపిలో కార్యకర్తలకు సంఘీభావం తెలియజేస్తున్న విజయసాయిరెడ్డి, మంత్రి సురేష్, జూపూడి ప్రభాకర్‌రావు, జంకె వెంకటరెడ్డి, వరికూటి అశోక్‌బాబు

- నియోజకవర్గానికి సాగర్ నీరు తెచ్చి, సాగునీటి ఎద్దడిని తీరుస్తా
- రాజ్యసభ ఎంపీ, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

కొండపి(సింగరాయకొండ): రానున్న ఎన్నికల్లో కొండపిలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అందరం కలిసికట్టుగా పార్టీ అభ్యర్థి, సౌమ్యుడుగా పేరొందిన మంత్రి ఆదిమూలపు సురేష్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కొండపిలోని సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలకు మంత్రి సురేష్ పరిచయ వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత పరిణామాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారన్నారు. గతంలో నియోజకవర్గ నాయకుల్లో అభిప్రాయ భేదాలు ఉన్నాయని, వాటిని పక్కన పెట్టి సమస్యలు పరిష్కరించే వ్యక్తిగా సురేష్‌ను గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కొండపి సీటును వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని, ఇందుకు మీ అందరి కలయికే నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు చేతులెత్తి సంఘీభావం తెలియజేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు కాంగ్రెస్, టీడీపీ గెలిచాయని మంత్రి సురేష్‌ను గెలిపించి వైఎస్సార్‌సీపీని కూడా గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ తాను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, కొండపి నాయకులపై నమ్మకం ఉందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డిని చూపి ఓటర్ల దగ్గరకు వెళ్లి ఓటు అడిగితే గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎంత మంది పార్టీలు ఫిరాయించినా తాను జగనన్న వెంటే ఉన్నానన్నారు. మాపై సీబీఐ వాళ్లు కేసులు నమోదు చేసినా పట్టించుకోలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడమే తన లక్ష్యమన్నారు. నేడు తోడేళ్ల గుంపు ఒక వైపు, జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు ఉన్నారన్నారు. టీడీపీ జనసేనకు విధి విధానాలు లేవని, భావజాలం, సారూప్యత లేదని విమర్శించారు. వ్యవస్థలను నాశనం చేయడమే టీడీపీ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేల సీట్లు మారుస్తున్నారని చంద్రబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, గతంలో చంద్రబాబు జవహర్, వంగలపూడి అనిత, పీతల సుజాతను మార్చలేదా అని ప్రశ్నించారు. అప్పుడు మీ చెత్త గుర్తుకు రాలేదా, దళితులంటే చిన్న చూపా అని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. కొండపిలో విజయం సాధించి నేను చెత్త కాదు బంగారం అని నిరూపిస్తానని మంత్రి సురేష్ ధీమా వ్యక్తం చేశారు. వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ కొండపిలో పోటీకి వైఎస్సార్ సీపీలో 10 మంది క్యూలో ఉన్నారని, కానీ టీడీపీకి స్వామి ఒక్కడే దిక్కని విమర్శించారు. రూ.500 నోటు విలువ ఎక్కడైనా ఒక్కటేనని, మంత్రి సురేష్ కూడా ఎక్కడైనా బంగారమేనని, ఆయన ఓటమి ఎరగరని ఈ సారి కూడా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కొండపి టీడీపీ గ్రూపుల సమస్యతో కుదేలైందని ఆరోపించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ కొండపిలో మంత్రి సురేష్ ముందు స్వామి జీరో అని, ఆయన గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని మన దృష్టంతా 175 కు 175 సీట్లు సాధించటమే లక్ష్యమన్నారు. అంతకుముందు నియోజకవర్గ ప్రజలు డాక్టర్ అంబేద్కర్ సెంటర్ నుంచి భారీ ర్యాలీతో విజయసాయిరెడ్డి, మంత్రి సురేష్‌కు డప్పు కళాకారుల వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి, వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కళ్యాణమండపం వద్ద విజయసాయిరెడ్డి, మంత్రి సురేష్‌కు రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా యూత్ ఆధ్వర్యంలో మసనం వెంకట్రావు క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి ఘనస్వాగతం పలికారు. జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, చిన్నా దంపతులు, సింగరాయకొండ పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి గజమాల వేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ హర్షవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీలు కట్టా శోభారాణి, వాకా వెంకటరెడ్డి, పటాపంజుల కోటేశ్వరమ్మ, కొండాబత్తిన మాధవరావు, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, బత్తిన మదన మనోహర్‌రావు, దద్దాల మల్లికార్జునరావు, పల్లపోలు బాలకోటిరెడ్డి, అరికట్ల కోటిలింగం, మండల జేసీఎస్ కన్వీనర్లు పిల్లి తిరుపతిరెడ్డి, గొట్టిపాటి మురళి, చింతపల్లి హరిబాబు, తాటికొండ రామచంద్రరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

సాగర్ నీళ్లు తెస్తాం..

కొండపి నియోజకవర్గానికి నాగార్జునసాగర్ తీసుకుని వచ్చేందుకు తన వంతు సహాయ సహకారాలు అందించి సాగునీటి ఎద్దడి తీర్చేందుకు కృషి చేస్తానని విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం సాగర్ నీరు కొండపి మీదుగా కనిగిరి వెళ్తుందని, ఆ నీటిని కొండపికి కూడా వచ్చేటట్లు మంత్రి సురేష్ కృషి చేస్తారని, తాను ఆయనకు సహకరిస్తానని అన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎటువంటి ప్రలోభాలు లేకుండా పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఇంటెలిజెన్స్ నెటవర్క్ బలోపేతం చేసేందుకు దృష్టి సారించినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రకాశం భవనంలో ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నగదు, బ్లాక్‌మనీ తరలింపు, బహుమతుల రవాణా, పంపిణీ, మద్యం సరఫరా కట్టడికి ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య ఈ అంశాల్లో సమన్వయం కోసం జిల్లా స్థాయిలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. తమ శాఖకు సంబంధించి సబ్జెక్టును మాత్రమే కాకుండా ఏ శాఖకు సంబంధించిన సబ్జెక్టు అయినా అనుమానం ఉంటే ఏ అధికారి అయినా తనిఖీ చేయవచ్చన్నారు. చెకింగ్ సమయంలో గుర్తించిన విషయాలను వెంటనే సంబంధిత శాఖకు తెలియచేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాల్లో ఆయా శాఖల అధికారులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేస్తామన్నారు. సంబంధిత శాఖలు ఈ దిశగా సిబ్బందిని ఎన్నికల కోడ్ కంటే ముందుగానే సిద్ధం చేసుకొని వారికి అవసరమైన అవగాహన కల్పించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల గోదాముల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను బలోపేతం చేయాలని ఆదేశించారు. టోల్ గేట్ల వద్ద నిరంతరం చెకింగ్ చేయాలన్నారు. రవాణా వాహనాల్లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. ఈ మేరకు లారీ ఓనర్స్ అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించి సూచనలు చేయాలన్నారు. డీటీసీ సుశీల, ఏఎస్పీ నాగేశ్వరరావు, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాథరావు, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వ్యవసాయ, వాణిజ్య పన్నులు, ఆదాయపన్నుల శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ మలికాగర్గ్

జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

- అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడితే సహించం
- జూద క్రీడలు వద్దు...సంప్రదాయ క్రీడలే ముద్దు
- ఎస్పీ మలికా గర్గ్



ఒంగోలు సబర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేలు, జూదం నిర్వహిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికాగర్గ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని పోలీస్ యంత్రాంగం మొత్తం ఆ దిశగా విధులు నిర్వర్తించాలని సిబ్బంది, అధికారులను ఆదేశించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జూద క్రీడలు వద్దని... సంప్రదాయ క్రీడలే ముద్దని హితవు పలికారు. కోడి పందేలు, జూదం, గుండాటలు నిర్వహించడం నిషేధించామన్నారు. ఇలాంటి వాటిని ఆడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి పోటీలతో పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. జూదాలు, కోడి పందేలు, పేకాట స్థావరాలు నిర్వహించే నిర్వాహకులను వెంటనే బైండోవర్ చేసుకోవాలని కూడా జిల్లాలోని పోలీస్ అధికారులను ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. ప్రత్యేక నిఘా కూడా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. స్థానిక పోలీసులు స్పందించకుంటే డయల్ 112, డయల్ 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీస్ వాట్సాప్ నంబర్ – 9121102266కు సమాచారం పంపించవచ్చని పేర్కొన్నారు.

ఇజ్రాయేల్‌లో ఉద్యోగావకాశాలకు ఆహ్వానం

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇజ్రాయేల్‌లో ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యం. శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టరింగ్ వర్క్, సెరామిక్ వర్క్, బిల్డింగ్ ఫ్రేం వర్క్, ఐరన్ బెండింగ్ పనుల్లో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు వివరించారు. 8వ తరగతి, అంతకంటే ఎక్కువ చదివిన వారు, ఇంగ్లిష్ భాషపై అవగాహన కలిగిన అభ్యర్థులు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి ఉండి, కనీసం 3 సంవత్సరాల అనుభవం ఉంచి అసక్తి కలిగిన అభ్యర్థులు ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9988853335 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఉల్లాసంగా రంగవల్లుల సంబరం


వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలు


మొదటి విజేతకు ఫ్రిజ్ అందిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, లక్ష్మి దంపతులు

- ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ ఆధ్వర్యంలో..
- హాజరైన ప్రతి మహిళకు చీర బహూకరుణ
- కనిగిరిలో సంక్రాంతి సంబరాలు

కనిగిరి రూరల్: కనిగిరిలో ముందస్తు సంక్రాంతి శోభ నెలకొంది. ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్సిటీ బోర్డు మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ సహకారంతో, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరిలో ఉత్సాహ భరిత వాతావరణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల ఆవరణలో మహిళలు భారీ సంఖ్యలో పోటీ పడ్డారు. న్యాయ నిర్ణేతలు పాలూరి సృజన, సుష్మ, ప్రమీల పరిశీలించి విజేతలను ప్రకటించారు. ప్రథమ బహుమతి పొందిన విజయకు ఫ్రిజ్, ద్వితీయ బహుమతి సాధించిన తిరుమలకు గ్రైండర్, తృతీయ, నాలుగో బహుమతులు పొందిన పి. మనోజ్ఞ, దుర్గకు మిక్సీలను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ చేతుల మీదుగా అందించారు. సుమారు 600 మందికి పైగా హాజరు కాగా.. పాల్గొనగా ప్రతి మహిళకు, వారితోటి వచ్చిన వారికి కూడా కన్సోలేషన్ బహుమతిగా చీరలను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా భోగిమంటలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల నృత్యాలు, పతాంగుల ఎగుర వేసే కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేశారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్సిటీ బోర్డు మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. విజేతలకు బహుమతుల పంపిణీ సభ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సుజాతరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలతో పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహించి మహిళలను ప్రోత్సహిస్తున్నానన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని, జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సాల్మన్, వైస్ చైర్మన్‌లు పులి శాంతి, ఆర్. మాణిక్యరావు, ఎంపీపీ ప్రకాశం, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తమ్మిరనేని సుజాతరెడ్డి, ఎస్‌కే జిలాని, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దేవకి సత్యావతి, సయ్యద్ రిజ్వానా ఖాలక్, రామనబోయిన ప్రశాంతి శ్రీను, ఎస్‌కే జాస్మిన్, పసుపులేటి దీప, ప్యారీజాన్, దేవరాజ్, దేవకి రాజీవ్, గోవర్ధన్ రెడ్డి, తిరుపతయ్య, దాసరి మురళీ, సీహెచ్ కిషోర్, నక్కా రామకృష్ణా, పి. రాజారెడ్డి, జానీ, ఎస్‌కే ఖాజా, చింతం శ్రీను, అబ్రహం లింకన్, మీరావలి, పండ్ల ఖాదర్, కాస్తాల బేబీ, కనమర్లపుడి లక్ష్మీ మోహన్, దుర్గమ్మ, భాగ్యమ్మ, నాగమణి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాసుల గురవయ్య, పార్టీ పట్టణ యూత్, మండల అధ్యక్షుడు డాక్టర్ రసూల్, మాలీ, మన్సూర్, కాశయ్య, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, భవనం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ మహిళా విభాగం నాయకులు తమ్మినేని సుజాతారెడ్డి, పులి శాంతిరెడ్డి, దేవకి సత్యావతి, సయ్యద్ రిజ్వానఖాలక్, రామనబోయిన ప్రశాంతి శ్రీను, పసుపులేటి దీప, ఎస్‌కే జాస్మిన్‌లతో పాటు, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన పాలూరి సృజన, సుష్మ, ప్రమీలను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, లక్ష్మీ దంపతులు అభినందించి సన్మానించారు.

పార్టీల సమక్షంలోనే ఈవీఎంల విభజన

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాబోయే సాధరణ ఎన్నికలకు సంబంధించి సిద్ధం చేసిన కొత్త ఈవీఎంలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలోనే నియోజకవర్గాల వారీగా విభజన చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రకాశం భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతూ పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని చెప్పారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటుకు పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా కృషి చేయాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, రాజశేఖర్, సత్యం, రఘురామ్, స్వరూప్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు అండగా ప్రభుత్వం

- పెన్షన్ ఆథరైజేషన్ ఆన్‌లైన్ ప్రక్రియకు కసరత్తు
- రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ డైరెక్టర్ డాక్టర్ మోహన్ రావు
- ఒంగోలు సబ్ ట్రెజరీ కార్యాలయంలో గెస్ట్ హౌస్ ప్రారంభం


గెస్ట్ హౌస్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మోహన్ రావు

ఒంగోలు సబర్బన్: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ఆథరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ప్రక్రియలో చేపట్టేందుకు కసరత్తు చేస్తోందని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మోహన్ రావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ప్రకాశం జిల్లా కేంద్రానికి ఒంగోలుకు వచ్చిన ఆయన తొలుత ఒంగోలు సబ్ ట్రెజరీ కార్యాలయంలో ట్రెజరీ శాఖకు చెందిన గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం జిల్లా ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్, పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు, సౌకర్యాలు అందేలా పనిచేస్తున్నామని వివరించారు. అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉద్యోగులకు, పింఛనుదారుల కోసం రాష్ట్రంలో 130 నూతన భవన సముదాయాలను సమకూర్చుతామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.75 లక్షల మందికి పెన్షన్ చెల్లింపులు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగి రిటైరైన మరుసటి రోజే పెన్షన్ ఫిక్స్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో స్పెషల్ చీఫ్ సెక్రటరీతో సమావేశం ఏర్పాటు చేసి విధివిధానాలు రూపొందించేకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. మాతృశాఖ ద్వారా పెన్షన్ ప్రపోజల్స్ అకౌంటెంట్ జనరల్ లేదా లోకల్ ఫండ్ కార్యాలయాలకు పంపి మంజూరు చేయించే విధానానికి స్వస్తి పలికేందుకు రంగం సిద్ధం చేశామని తెలిపారు.

జిల్లా ఖజానా శాఖ అధికారి ఏ.జగన్నాథరావు మాట్లాడుతూ ఒంగోలు ఖజానా శాఖ కార్యాలయం కొత్త భవనంలోకి వెళ్ళినప్పుడు బడ్జెట్ కావాలని అడిగిన వెంటనే మంజూరు చేసేందుకు డైరెక్టర్ పూర్తి స్థాయిలో సహకరించారన్నారు. జిల్లా ఖజానా శాఖ ఏడీ కె.రాజ్ కుమార్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆల్‌ఫ్రెడ్, ఏడీ కె.రాజ్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆల్‌ఫ్రెడ్, మరో ఏడీ కె.ఎలీషా రాణి, కేవీ కెనడీ, ఏపీటీఎస్ఏ అధ్యక్షుడు పీవీ నారాయణ, కార్యదర్శి ఎస్‌కే.అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొనకనమిట్ల: సంక్రాంతి సందర్భంగా కొనకనమిట్ల మండలం గొట్లగట్టు గ్రామంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ పోటీలు మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సహకారంతో జరుగుతాయన్నారు. గెలుపొందిన క్రీడా జట్లకు వరుసగా రూ. 25, రూ.20, రూ.15, రూ.10 వేలతో పాటు మెమొంటో షీల్డ్‌లు దాతల సహకారంతో అందజేస్తామన్నారు. రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. దూర ప్రాంత క్రీడాకారులకు భోజన వసతి ఉంటుందన్నారు. వివరాలకు 99123 12365, 9705347598 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఏసీబీ అధికారుల అడ్డగింత.. కేసు నమోదు

యర్రగొండపాలెం: ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్న సమయంలో వారిని అడ్డుకొని విధులకు ఆటంకం పరచిన ఒకరిని, అతనితోపాటు వచ్చిన మరికొంతమందిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 10వ తేదీన త్రిపురాంతకం మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన రైతు ఎస్.నాగిరెడ్డి నుంచి యర్రగొండపాలెం మండలంలోని గంగపాలెం వీఆర్వో జె.కుమార్ నాయక్, గురిజేపల్లి వీఆర్‌ఏ షేక్ చిన్న జానీబాష, వారి అనుచరుడు చింతలచెరువు వెంకటేశ్వరరెడ్డి లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. అక్కడే ఉన్న వీఆర్‌ఏ జానీబాష సోదరుడు షేక్ పెద్ద జానీబాష ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం పరిచాడు. దీంతో అతినితోపాటు పరివారంపై ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నామనిఎస్సై ఎస్.వి.రాజేష్ తెలిపారు.

పేస్ విద్యార్థినికి బంగారు పతకం


విద్యార్థిని కావ్యను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్ తదితరులు

ఒంగోలు: స్థానిక పేస్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ చదువుతున్న ఎం.కావ్య జెఎన్‌టీయూ కాకినాడ నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కావ్యను కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాలు బలపేతంగా ఉండాలి

ఒంగోలు అర్బన్: రైతు సంఘాలు ఏర్పాటుతో పాటు బలోపేతంగా ఉండాలని అందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. జిల్లాలో సాగు చేస్తున్న ప్రధాన పంటలైన 15 రకాల పంటలకు సంబంధించి మేలైన యాజమాన్య పద్ధతులు, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, క్షేత్ర స్థాయిలో గమనించిన సమస్యలకు పరిష్కారాలకు సంబంధించి ఛాయ చిత్రాలతో సహా సంకలనం చేసిన గ్రామ వ్యవసాయ సహాయకుల కరదీపిక పుస్తకాలను శుక్రవారం ప్రకాశంభవనంలో వ్యవసాయ సహాయకులకు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు, వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రైతులకు మేలు జరిగేలా రైతు భరోసా కేంద్రాలు సేవలందిస్తున్నాయని, వ్యవసాయ సహాయకులు కూడా రైతాంగానికి మేలు చేసేలా పనిచేయాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతాం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆ మేరకు ప్రభుత్వ పరంగా ఇస్తున్న శిక్షణలను సంబంధిత అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ అన్నపూర్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై వెల్లంపల్లి వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి వద్ద గుంటూరు వైపు నుంచి కర్నూలు వైపు వెళుతున్న వాహనం దోర్నాల నుంచి పల్నాడు జిల్లా రొంపిచర్ల వెళుతున్న కారును ఢీ కొట్టింది. ఈప్రమాదంలో షేక్ షమి (36) మృతి చెందగా నాగూర్‌వలి, మస్తాన్‌వలి, మస్తాన్ బీ గాయపడ్డారు. 108 వాహనంలో వైద్య సేవలందించి మెరుగైన వైద్యసేవలకు వినుకొండ తరలించారు. వీరి స్వగ్రామం రొంపిచర్ల కాగా వైద్యసేవల నిమిత్తం దోర్నాల వెళ్లి తిరుగు ప్రయాణంలో గాయపడ్డారు. ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.